అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్లలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నయాకీలాలో మురుగు సమస్యపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే ఈ సమస్యకు చెక్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. టోలిచౌకీ నుంచి మోతీదర్వాజ వరకు జరుగుతున్న పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచి పనులను పూర్తి చేయాలన్నారు. బాల్‌రెడ్డినగర్‌లో సైతం గత సంవత్సరం ప్రారంభించిన పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. పనులను కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి వదలకుండా నిర్ధారిత సమయంలోనే పూర్తి చేయాలని ఆయన కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షులు హారూన్‌ఫరాస్, బల్దియా అధికారులు తదితరులున్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో కేన్సర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్‌కుమార్

గోల్కొండ: సకాలంలో గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేయవచ్చునని సర్జికల్ యాంకలజిస్ట్ డాక్టర్ రాకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కేన్సర్‌పై గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. రెనోవా బీబీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధికి గతంలో సకాలంలో గుర్తించలేని పరిస్థితి ఉండేదని అయితే నేడు వైద్య రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. సరైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తే కేన్సర్ గుర్తు పట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు, సర్జికల్ యాంకలజిస్ట్ డాక్టర్ గౌతమ్, రేడియేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ అక్రం తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి


మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు ప్రాణసంకటంగా మారిన ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, కాంట్రాక్టర్ల అసోసియేషన్ తెలంగాణ జేఏసీ మీడియా సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటర్‌బోర్డులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..వాటర్‌బోర్డులో ఓపెన్ టెండర్ సిస్టమ్‌ను, ఎల్‌టీసీ విధానాన్ని అమలు చేస్తే కాంట్రాక్టర్ల జీవనోపాధి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వాటర్‌బోర్డు ఎండీ దృష్టికి కాంట్రాక్టర్ల సమస్యలు వివరించి పరిష్కరిస్తామన్నారు.

యువకుడి అదృశ్యం


రషీద్ అహ్మద్

చాంద్రాయణగుట్ట: యువకుడు అదృశ్యమైన సంఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. హషామాబాద్ ప్రాంతానికి చెందిన రుబీనా, రషీద్ అహ్మద్(29) భార్యాభర్తలు. ఈ నెల 21న రోజు మాదిరిగానే తాను పని చేసే జల్‌పల్లికి వెళ్లిన రషీద్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లభించలేదు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'నానీ కిరణాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపీ

గన్‌ఫౌండ్రీ: వర్ధమాన కవులు వచన కవితా రంగంలోకి అడుగు పెట్టడం ఎంతో అభినందనీయమని ఆచార్య ఎన్.గోపీ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో యువ రచయిత కె.రవికాంత్ రచించిన 'నానీ కిరణాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రచయిత సమకాలిన విషయాలతో పాటుగా వెంగ్య ప్రధానంగా చురకలు అంటిస్తూ చేసిన కవిత్వం బాగుందని కొనియాడారు. మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ మాట్లాడుతూ..మహిళ పట్ల సానుభూతితో కూడి మహిళా సాధికారత స్పృహ కనిపిస్తున్నాయని అదేవిధంగా సెల్‌ఫోన్ల వాడకం వల్ల కలిగే అనార్థాలను ఎంతో చక్కగా రాశారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్‌లాల్, డాక్టర్ ఎస్.రఘు, కార్టూనిస్టు శంకర్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో దీపావళి ఉత్సవాలు ప్రారంభం



చాంద్రాయణగుట్ట: మేకలబండలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగే దీపావళి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు అమ్మవారికి అభిషేకం, లక్ష్మీ హోమం, అలంకరణ కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏర్పాటు చేసిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మూడు రోజుల పాటు అమ్మవారు లక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టారు.

బెల్టు షాపు నిర్వాహకుల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన ప్రభాకర్ రెడ్డి(58), జె.చంద్రమోహన్(50) వైన్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి తమ తమ ఇళ్లల్లో ఉదయం, అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలోని బృందం ఛత్రినాక పోలీసులతో కలిసి మంగళవారం దాడులు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసింది. వారి నుంచి రూ.71,170ల విలువ జేసే 405 బాటిళ్లలో ఉన్న 82.46 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఛత్రినాక పోలీసులకు అప్పగించారు. గతంలోనూ కూడా వీరిపై కేసులు నమోదై ఉన్నాయి.

'అవార్డులు స్ఫూర్తిని కలిగిస్తాయి'


అవార్డు గ్రహీతలతో సత్యనారాయణ

గన్‌ఫౌండ్రీ: సమాజంలో అవార్డులు బాధ్యతలను పెంచడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వరలో పలువురికి జాతీయ అవార్డులను, పలువురికి గౌరవ డాక్టరేట్లను అందజేశారు. ఈ సందర్భంగా విశాఖ నగర మాజీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ.. గత 30, 40 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తులను గుర్తించి డాక్టరేట్లను ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ డి.శ్రీనివాస్‌లు, శ్రీరామ సాయి సేవా సమితి అధ్యక్షులు కాటసాని వెంకట్‌రెడ్డి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగు భాష చైతన్య సమితి కన్వీనర్ బడేసాబ్, డాక్టర్ అంబిక, డాక్టర్ ఝాన్సీలక్ష్మి, సంస్థ వ్యవస్థాపకులు డి.చిన్నారావు పాల్గొన్నారు.


భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


సిద్ధిఅంబర్‌బజార్‌లో బంగారం కొనేందుకు బారులు తీరిన జనం

ఘనంగా ధన్‌తేరస్ వేడుకలు

చార్మినార్: దీపావళి పర్వదినానికి ముందే వచ్చే ధన్‌తేరస్‌ను ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ధన్‌తేరస్‌ను పురస్కరించుకొని పాతబస్తీలోని బంగారు ఆభరణాల దుకాణాల యజమానులు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో షోరూంలన్నీ కళకళలాడాయి. బంగారం ధరలు ఆకాశాన్ని అంటినా..వినియోగదారులు మాత్రం వెనుకడుగు వేయకుండా ధన్‌తేరస్‌కు తప్పనిసరిగా బంగారాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే ఆచారంతో మహిళలు కుటుంబసభ్యులతో కలిసి బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి వచ్చారని భవానీ జువెల్లర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు.


బంగారు ఆభరణాలు ఖరీదు చేస్తున్న వినియోగదారులు

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు..

ధన్‌తేరస్ సందర్భంగా భక్తులు భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 నుంచి 5 గంటల వరకు అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, ఉదయం 7 గంటలకు హారతి, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

సిద్దిఅంబర్‌బజార్‌లో..

జియాగూడ: ధన్‌తేరస్‌ను పురస్కరించుకొని మంగళవారం బంగారం దుకాణాలు, జ్యువెలరి దుకాణాలు కొనుగోళు దారులతో కిటకిటలాడాయి. ధన్‌తేరస్ రోజున ఎంతో కొంత బంగారం, వెండి, బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు కొనేందుకు ఎంతో ఆసక్తి చూపారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పడికీ ఎంతో కొంత బంగారం కొనేందుకు సిద్దిఅంబర్‌బజార్‌లో ఓ దుకాణం వద్ద బారులు తీరారు.

శుభాకాంక్షలు



సుల్తాన్‌బజార్: దేవాదాయ ధర్మాదాయ శాఖ నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జండగే హనుమంతును జేఏసీ కన్వీనర్ పరాచారం రవీంద్రచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాండూరి కృష్ణమాచార్యులు, కొమురవెల్లి దేవస్థానం ముఖ్య అర్చకులు మల్లికార్జున్‌గారు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సోరియాసిస్‌పై అవగాహన ర్యాలీ

అఫ్జల్‌గంజ్: సోరియాసిస్ ప్రాణాంతకరమైన వ్యాధి కాదని ఈ విషయమై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ భూమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ చర్మ వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు విభాగాల్లో అవగాహన ర్యాలీ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్‌ఎంఓలు డాక్టర్ రఫీ, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి: ఎంబీటీ

డబీర్‌పురా: రెయిన్‌బజార్‌లో ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్న బాధితురాలికి ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లా ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి జరిగిన పేలుడు ఘటనలో భార్యాభర్తలు మృతి చెందగా..వారి మనువరాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రమాదానికి గురైన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

బేగంబజార్‌లో జీహెచ్ఎంసీ అధికారుల తనిఖీలు

అఫ్జల్‌గంజ్: బేగంబజార్, ఫీల్‌ఖానా, మహారాజ్ గంజ్, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లో అబిడ్స్–14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ తనిఖీలు నిర్వహించారు. పలు హోల్‌సేల్ టపాసుల దుకాణాల వద్ద తనిఖీలు చేపట్టి భద్రత ప్రమాణాలపై దుకాణాల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రతి హోల్‌సేల్ దుకాణం వారు భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. అందుబాటులో నీటి ట్యాంక్‌లతో పాటు ఇసుక ఉంచాలని ఆయన సూచించారు. భద్రత ప్రమాణాలు పాటించని వారిపట్ల చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు.


తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరమణ తదితరులు

అలరించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కల్చరల్ ఫెస్ట్


మాట్లాడుతున్న డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని బాపూఘట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం గొప్ప విషయమని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తూ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో మంగళవారం లంగర్‌హౌస్ బాపూఘట్ వద్ద కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రకటనను స్వాగతిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. గాంధీజీ అంటే ఒక పుస్తకం అని గాంధీజీని పూర్తిగా తెలిసిన వారి జీవితం విజయవంతం అవుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది చిన్నారులు గాంధీ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఎస్ఎంపీ పాఠశాల విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రధాన కార్యదర్శి యానాలా ప్రభాకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి కె.సుభాష్‌చంద్ర, ఉపాధ్యక్షుడు గాంధారి ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర ధశరథ్‌గౌడ్, పి.హరిదీప్‌రెడ్డి, బాపూస్మృతి సభ్యులు ఏ.పరమానందం, చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణన్‌ను కలిసిన వైద్యుల సంఘం బృందం



సుల్తాన్‌బజార్: నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరహరి, లాలుప్రసాద్ రాథోడ్‌ల బృందం మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల సమస్యలపై టీజీడీఏ పోరాడుతుందన్నారు. గత పదేళ్లుగా ఈ సంఘంలో ఎలాంటి యాక్టివిటీ లేన్నందునా సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. సభ్యులకు ఐడీకార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్యులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. మురళి, సుధాకర్, దీన్‌దయాల్ పాల్గొన్నారు.

సినీనటి అన్నపూర్ణకు సూర్యకాంతం అవార్డు



గన్‌ఫౌండ్రీ: మైహోం అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత సినీనటి సూర్యకాంతం శత జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సినీ నటి అన్నపూర్ణకు సూర్యకాంతం అవార్డును అందజేశారు. అంతకు ముందు సినీ జర్నలిస్ట్ ఎస్‌వి.రామారావు రూపొందించిన అత్తగారు జిందాబాద్ లఘు చిత్రాన్ని ప్రదర్శించగా సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాధాకృష్ణ, సీతారామయ్య, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి యువత ఎంతో అవసరం

గన్‌ఫౌండ్రీ: ప్రపంచాన్ని శాశించే స్థాయికి భారత దేశం చేరిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోజ్‌ఘర్‌మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలలో ఎంపికైన 155 మందికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..యువశక్తితో ఎన్నో అద్భుతాలు చేయొచ్చని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో యువత ఎంతో అవసరం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. దాదాపు 75 దేశాలకు డిఫెన్స్ పరికరాలను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఫరహాత్ అలీ

జియాగూడ: విద్యుత్ శాఖ లైన్‌మెన్ శ్రీనివాస్‌రావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బేగంబజార్ డీఈ ఫరహాత్ అలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్వాన్ సెక్షన్ విద్యుత్ లైన్‌మెన్ శ్రీనివాస్‌రావుపై జరిగిన దాడిని ఖండిస్తూ హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులంతా బేగంబజార్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఫరహాత్ అలీ మాట్లాడుతూ..శ్రీనివాస్‌రావుపై జరిగిన దాడి గురించి ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. బాధితుడు శ్రీనివాస్‌రావును మెరుగైన చికిత్సల కోసం కేర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎంత ఖర్చు అయినా భరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాంబాగ్ ఏడీఈ గణేష్ శ్యామ్, మీరాలం ఏడీఈ వెంకటేష్, ఫలక్‌నూమా ఏడీఈ రాజు, కార్వాన్ ఏఈలు రియాజ్ అహ్మద్, శ్రీనివాస్, ప్రణవింద్, సైదా నాయక్, నరేందర్, రాము పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మెనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. ప్రయాణికులు, కాలనీ సంక్షేమ సంఘాల నుంచి తగిన సలహాలు, సూచనల కోసం నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. సలహాలు, సూచనల కోసం 99592 26133లో సంప్రదించాలన్నారు.

నేడు ఫలక్‌నుమాలో..

చాంద్రాయణగుట్ట: ఈ నెల 30న ఆర్టీసీ బస్సులకు సంబంధించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫలక్‌నుమా డిపో తరఫున డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం ఎస్.రమేష్ తెలిపారు. బస్తీలకు బస్సు సదుపాయం, బస్సు రూట్లు, బస్సులలో సిబ్బంది వ్యవహార శైలి, సమయపాలన లాంటి విషయాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల నడుమ డీఎం(99592 26131) నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లయితే..డీఎం పరిష్కార సమాధానాలు ఇస్తారు.

కార్వాన్‌లో 'ఆయుష్మాన్ భారత్'



గోల్కొండ: ప్రధాని మోదీ పేద ప్రజల కోసం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ప్రారంభించారని కార్వాన్ ప్రముఖ్ ఈశ్వర్‌జ్యోషి అన్నారు. మంగళవారం కార్వాన్‌లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ కార్యక్రమం వల్ల పేద బడుగు వర్గాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. మాతాశిశు ఆరోగ్య సేవలు, నవ జాత శిశువుల ఆరోగ్య సంరక్షణ సేవలతో పాటు ఇతర అన్ని రకాల సేవలు ఈ పథకం ద్వారా పొందవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, ఆయుష్ డాక్టర్ నర్మద, పర్యవేక్షణ అధికారి వెంకటస్వామిగౌడ్, సిబ్బంది లలిత, ఉమ, జ్యోతి, ఉబేద్, సరిత తదితరులున్నారు.

వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంక్షేమానికి కృషి


మహ్మద్ రహ్మత్‌అలీని సత్కరిస్తున్న సందీప్‌కుమార్, ప్రభుదాస్ తదితరులు

అబిడ్స్: వాణిజ్యపన్నుల ఉద్యోగ సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ టీఎన్జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రహ్మత్ అలీ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయనను సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు సందీప్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభుదాస్, కార్యదర్శి జి.ఆదిత్య ఘనంగా సత్కరించారు. అనంతరం మహ్మద్ రహ్మత్ అలీ మాట్లాడుతూ..దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి, దేవులపల్లి శ్రీనివాస్, అబిడ్స్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ బాసిత్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు


గోల్కొండ: షేక్‌పేట్‌లోని కట్టమైసమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూస వేణు గోపాల్‌రావు, వినయ్‌కుమార్, ఉర్మిల, భిక్షపతి తదితరులున్నారు.

తప్పిపోయిన మేకల అప్పగింత



గౌలిపురా: తప్పిపోయిన 10 మేకలను భవానీనగర్ పోలీసులు అర గంటలోనే గుర్తించి యజమానికి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ అజ్జర్ తన నివాసంలో 10 మేకలను పెంచుకుంటున్నాడు. కాగా ఇంట్లో ఉన్న 10 మేకలు కనిపించకుండా పోవడంతో మహ్మద్ అజ్జర్ మంగళవారం ఉదయం 11 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి మేకలు స్థానికంగా ఉన్న మహ్మద్ నయీం నివాసంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో తప్పిపోయిన 10 మేకలను పోలీసులు అర గంటలోనే గుర్తించి యజమానికి అప్పగించడంతో పోలీసులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నగరంలో 144 సెక్షన్ ఎత్తివేయండి


ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: నగరంలో 144 సెక్షన్ ఎత్తివేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను రక్షించే బాధ్యత పోలీసులపై ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ నగరంలో 144 సెక్షన్‌ను ప్రవేశపెట్టడం సరైన చర్య కాదన్నారు. సభలు, సమావేశాలు, నిరసనలు, ఆందోళనలు చేసే హక్కులు రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజలకు భారత రాజ్యాంగం ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరసనలు చేసే అధికారం బీఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు.